పి.వి.బి. శ్రీరామమూర్తి

# ఆనందరావూ - ఆనపకాయ

ప్రియమైన శ్రీవారికి...

మీ శ్రీమతి అనంతలక్ష్మి వ్రాయునది. ఇక్కడంతా క్షేమం మీరంతా క్షేమమని తలుస్తాను. బుజ్జిగాడిప్పుడిప్పుడే ఊసులాడుతున్నాడు. వాడు రోజుకోరంగు కనిపిస్తున్నాడు. కానీ చివరకి మీరంగే తేలొచ్చనిపిస్తోంది. మరీ మీ నలుపు మాత్రం ఉండదేమో కూడా! ఆలోతు కళ్ళూ, బండముక్కూ మాత్రం మీదేనండోయ్! (అయ్యో! అనంతం! ఉత్తరంలో కూడా నన్ను కించపరచటం నీకెంత ఆనందమో కదా? ఆనందం - అంతరంగం)

వచ్చేటప్పుడు మాత్రం క్రిందటి సార్లా కాకుండా మన పాదుకు కాసిన అనపకాయలు - పింజలయినా సరే పర్లేదు తీసుకురండి! కాయలు పెద్దవైతే మాత్రం రెండుకన్నా ఎక్కువయితే, బియ్యం డ్రమ్ముప్రక్కనే గోనె సంచులు ఉంటాయి. ఒకటి తీసి, కాయలందుల్లో వేసి, మూతికి తాడు గట్టిగా కట్టి తీసుకురండి. మీరుసలే మాలోకం! (వీధిలోకెళ్తే చెల్లని దమ్మిడీకి విలువ చెయ్యవు గానీ - వేలు తెచ్చి పోస్తున్న నీకు నీమొగుడు మాలోకమే?"ఆనందం అంతరంగం!) ఒకటైతే బిగ్‌షావర్‌లో వట్రండి. మర్చిపోయి చేతులూపుకుని వచ్చెయ్యకండి!

"ఆనపకాయ పప్పుకూర మీ మరదలికెంత ఇష్టమో?

ఆనపకాయ తొక్కుపచ్చడి నాకిష్టమని మీకెలానూ తెలుసు!

ఆనపకాయ పులుపేసి వండినా, నూలు పాడేసి వండినా నాన్నారికి ప్రాణం!



ఆనపకాయ కూరంటే అమ్మకి మరేం అక్కరే లేదు!

అన్నట్టు అనపకాయ కొబ్బరి కోరులా చేసి, పాలు పోసి, జీడిపప్పు పంచదారా - ఏలకుల పొడి వేసి మా పక్కింటావిడ మొన్న పాయసం చేసిందండీ! మీరయితే వదలనుకోండి (ఏంటీ? పక్కింటావిణ్ణా? పాయసాన్నా? ఇంకా నయం, కాకరపాదు వెయ్యలేదు. లేకపోతే కాకరకోరు కజ్జికాయలు, కాకర బొబ్బట్లో కూడా చేసేసేవారేమో? - ఆనందరావు అంతరంగం)

మళ్ళీ ఉత్తరం.

"ఇక్కడ ఆనవకాయ ఇరవై రూపాయలు. మొన్న సాంబారులోకో ముక్క - చిన్నదే రెండున్నరకి తెచ్చారు నాన్న! అందువల్ల అశ్రద్ధ చేయకుండా పట్రండి. పక్కింటావిడ అడిగిందని అష్టవంకర్లూ తిరిగిపోయి అవివకిచ్చేసి వట్టి చేతుల్తో రాకండి!

(ఇంకానా - గతసారి అలా చేసినందుకు నువ్వు నా చెవిలో పేల్చిన బాంబులకి ఇప్పటివరకూ నా చెవులు వినిపించటం మానేసాయి - ఆనందరావు అంత రగంగం)

వచ్చేటప్పుడు సరస్వతికి చెప్పండి -రోజూ పాదుకు నీళ్ళు పొయ్యమని. శ్రీన్ని ఇంటివట్టున ఉండమనండి. వాళ్ళు టీ.వీ.చూస్తూ ఉండిపోగలు. ఆ గేటు వేసుకోమనండి. లేకపోతే ఆనప్పాదును పశువులు కొరికేయగలవు.

మరి ఉంటానండి, నిద్ర ముంచుకొస్తోంది.

ఆనపకాయలు మర్చిపోకండేం

-అనంతలక్ష్మి"

ఉత్తరం చదివి నీరసపడిపోయాడు ఆనందరావు. ఆనందరావుకీ - అనంతలక్ష్మికీ ఏ విషయంలోనూ అభిప్రాయాలు కలవ్వు. ఆనందరావుకి పడమటావకాయ ఇష్టం. అనంతలక్ష్మికి బెల్లపు ఆవకాయ ఇష్టం. ఆనందరావుకి వంకాయ ప్రాణం. అనంతలక్ష్మికి వంకాయంటే రోత, ఆనందరావుకి ఇల్లు తప్పించి ఎక్కడికెళ్ళాలన్నా ఇష్టం ఉండదు. అనంత లక్ష్మికి రెండు నెలల కైనా ఓ టూరుండాల్సిందే. వెళ్ళిన ప్పుడల్లా రెండు మూడు సూట్‌కేస్‌ల లగేజీలు మోసుకెళ్తుంది. ఆనందరావు సింపుల్‌గా ఓ బేగ్ చాలంటాడు.

ఆనందరావు అనంతలక్ష్మి అభిప్రాయాలతో ఏకీభవించకపోయినా తిరస్కరించడు. అనంతలక్ష్మి ఆనందరావు అభిప్రాయాలను తిరస్కరించటమే గాక మనసును గాయపరిచే విధంగా కూడా మాటలు విసురుతుంది. మొదట్లో అనంతలక్ష్మి వల్ల మానసికంగా కృంగిపోయినా - తరువాత అలవాటు చేసేసుకున్నాడు.

తెల్లారి ప్రయాణం.

అందుకే పెరట్లోకెళ్ళాడు పెరట్నిండా ఆనందంతో అల్లుకుపోయిన ఆనప్పాదును వెతికితే ఒక పెద్ద ఆనపకాయ, మరో చిన్న ఆనపకాయా కనిపించాయి. ఇంకా బుల్లిబుల్లి కాయలు ఆయిదారు ఉన్నాయి. 'అవన్నీ తీసుకెళ్తే మాత్రం అనంతలక్ష్మి రాత్రి తనను ఆనప్పాదులా అల్లేయటం తథ్యమే! అయినా - తీసుకెళ్ళే శక్తి తనకులేదనుకున్నాడు ఆనందరావు. రేజరు బాక్సులోంచి తుప్పుపట్టిన బ్లేడును తీసి చాలాసేపు శ్రమించి కాయలుకోసాడు. వాటిని బిగ్‌షాపర్లో పెట్టాడు.

చీకట్నే ప్రయాణం.

ఆనందరావు ఊరికి చివర్ని ఉంటున్నాడు. ఎక్కటికెళ్ళాలన్నా అరమైలు నడిచివెళాల్సిందే. ఒకచేత్తో సూట్‌కేస్, మరోచేత్తో ఆనపకాయల సంచీతో బయలేదేరాడు. మధ్యలో రిక్షావాడు సీటులో పడుకుని నిద్రపోతున్నాడు. లేపితే లేవలేదు. మంచి మందు పట్టుమీదున్నాడు. మత్తుగా కళ్లు తెరిచి "కావాలంటే తొక్కుకుపదా పదిచ్చేసెయ్యి.

అట్నుంచి నేనొచ్చేస్తాను" అన్నాడు. దాంతో తలతిరిగిపోయింది. నడవటం వల్ల కాళ్ళూ - ఆనపకాయలవల్ల జబ్బలూ పీకుతుంటే ఎలాగోలా కాంప్లెక్స్ చేరుకున్నాడు.

వెళ్లగానే బస్సుంది. ఎక్కాడు.

బస్సయితే అందింది కానీ సీటు లేదు కూర్చోటానికి మహారద్దీగా ఉంది. సూట్‌కేసూ రేక్‌లో పెట్టాడు. ఆనపకాయల సంచీ కాళ్ల మధ్యనుంచాడు. బస్సు స్పీడందుకుంది. రెప్పలు వాలాయి. షడన్ బ్రేక్ పడింది. బుర్ర ప్రక్కనున్న రాడ్‌కు గుద్దుకుంది. ప్రాణం విలవిలలాడింది. కాళ్ల మధ్య సంచీ గుర్తొచ్చింది. చూస్తే సంచీయే ఉంది. కాయల్లేవు.

"అయ్యో, ఆనపకాయలు, ఆనపకాయలు!" అనుకోకుండా అరిచేసాడు. "రక్షించండి, రక్షించండి!" అని అరిచినట్టు.

"ఏంటయ్యా, పర్సు పోయినట్టు ఏంటా గావుకేకలూ!" ప్రక్కనే ఉన్నాయనకు నిద్రాభంగం జరిగినట్టుంది. చికాకు పడ్డాడు.

"సారీ సార్, ఈ సంచీలో ఆనపకాయలు...." అంటుండగా-

"ఏంటీ, ఆనపకాయల కోసం అంత హైరానా పడి పోతున్నావ్! దాంట్లో వజ్రాలు ఏమన్నా ఉన్నాయా?" ఇంకొకాయన వ్యంగ్యంగా.

"నా బొంద. అది పాదునుంచి ఫ్రెష్‌గా కోసుకొచ్చింది.

"ఆనపకాయలు పాదులనుంచి కాకపోతే మహావృక్షాల నుంచి కోస్తారటయ్యా!" ముసలాయన పరిహాసం.

"ఛీ..ఛీ..ఈ ఆనపకాయల వల్ల వీళ్లకంటికి నేనో అల్లాటప్పాయిలా కనిపిస్తున్నా" అనుకుని "అది కాదండీ, ఇవి మా పెరట్లో కాసినవి" అన్నాడు.

"ఇదిగోనయ్యా! ఈ సీటుకిందకి దొర్లుకుంటూ వచ్చేసింది." అన్నాడా ముసలాయన. ఆ ప్రక్కనే చిన్నాకాయలా తల్లిప్రక్కన పిల్లలా ఉంది.

"కాయెంతయిందో?"

"చెప్పాను కదండీ. మా పెరట్లో కాసినవనీ"

"అదీ సంగతి. అందుకే అంత ముచ్చటగా ఉన్నాయి. బజార్లో అయితే మచ్చమచ్చలూ.... తొక్క పెళుసూను. హైబ్రీడాలా ఉంది"

"కాదండీ. దేశవాళీయే"

"హైబ్రీడు చూపుకే కానీండి. రుచా,పచా?"

"నిజమే వాట్లో మాత్రం రుచెట్లా వస్తుంది. అంతా కల్తీ వ్యవస్థ దోపిడి మయం. ఈ బూర్జువా సమాజంలో మంచివస్తువులెట్లా వస్తాయి" అన్నా డింకో ఆయన.

"నాకు తెలీకడుగుతానూ...... ఆనపకాయకీ...... బూర్జువా సమాజానికీ సంబంధ వేమిటండీ?" ఓ కుర్రాడు ప్రశ్నించాడు.

"అవునయ్యా! ఇది కుళ్లిన సంఘం దీని గోడలు కూలిపోవాలి. ఈ పునాదులు అవినీతితో నిర్మించబడ్డాయి. అందుకే ఈ దేశంలో ఆనప్పాదు కూడా మంచికాయలు కాయలేదు.

"వివరంగా చెప్పండి సార్. నాకేం అర్థం కాలేదు?" కుర్రాడు ఉత్కంఠగా అడిగాడు.

"ఏముందయ్యా! మనం తెచ్చుకున్న సీడ్సు విదేశాలవి. దానికేసే ఎరువులు విదేశాలవి. పురుగుల మందు విదేశాలవి. వాటిని తెచ్చుకోవడంలో లాలూచీలు. ఈ లాలూచీల వల్ల వాళ్ళు చీఫ్ క్వాలిటీ మందులు పంపుతారు. అవి వాడితే మంచి దిగుడడెలా వస్తుంది?" వివరించాడు. వివరించి "అందుకే కమ్యూనిష్ట సమాజం రావాలి. అంతవరకూ

స్వచ్ఛమైన తోటకూర కూడా దొరకదు'' అన్నాడు.

''కమ్యూనిస్టులే రూలింగ్ చేస్తే నైవేద్యానికే సరుకులు దొరకవు. రక్తం త్రాగి బ్రతకాలి.'' యాంటీ కమ్యూనిస్ట్ అయిన వ్యక్తి అన్నాడు.

''అసలు నైవేద్యాలు దేనికండీ! నైవేద్యమంటే దేవునికి లంచం అన్నమాట. ఇదే మన సంస్కృతా?''

''చాల్లాల్లేండి. మీ లాంటి పిడివాదులుండబట్టేత మన సంస్కృతి ఇలా భ్రష్టు పట్టింది'' అన్నాడు యాంటీ కమ్యూనిస్ట్. స్పీడు బ్రేకర్సు వల్ల డ్రైవర్ బ్రేక్ వేసాడు. ఆ వెంటనే ''అమ్మో, చచ్చిపోయాన్రా దేవుడా!'' అన్న పెద్ద అరుపు వినిపించింది. సూట్ కేసేదైనా ఎవరి నెత్తి మీదనో పడిందో, ఏమో అనుకున్నారందరూ.

''ఎవరయ్యా, ఎవరీ ఆనపకాయని కేరియర్లో పెట్టింది?' అదేదో నడిరోడ్లో రేడియోబాంబు పెట్టి నంత తప్పుగా కండక్టర్ గద్దించాడు.

''ఏమయింది సార్?''

''ఇంకా ఏం కావాలి?'' ఆనపకాయ నెత్తిమీద పడింది. అమ్మో.... అబ్బా....'' అంటూ ఆనపకాయ లాంటి గుండును తడుముకున్నాడు. ఆ వేదపండితుడు అందరూ ఆనందరావుని చీవాట్లు పెట్టారు. పాపం! వేపదండితుణ్ణి నొప్పి తలంతా ఆనపతీగలా అల్లేసింది. తడుముకుంటూనే ఉన్నాడు. ముందు సీట్లో ఉన్న పదిహేనేళ్ల పిల్ల నవ్వాపుకోలేక రుమాలు నోటికడ్డం పెట్టుకుంటోంది. మళ్లీ ఆనపకాయని కేరియర్లో పెట్టబోతుంటే అందరూ కేకలేశారు. కిటికీ లోంచి దాన్ని పారేద్దామన్నంత చికాకేసింది. ఈ సారి సంచీని చేత్తోఎత్తి పట్టుకొని మీద యినప చువ్వని ఊతంగా పట్టుకున్నాడు. సంచీతాళ్లని ఇనుపచువ్వకు ముడివేసాడు. బస్సు జోరుగా పోతోంది. ఆనందరావుకి కునుకు పట్టేసింది.

''వామ్మో! చంపేసావయ్యా! నీ ఆనపకాయ బద్ధలవ్వా, చంపేస్తున్నావు కదయ్యా!'' ముందున్న వ్యక్తికి, ఇనుపగుండులా తగిలి మొట్టికాయలు పెడుతుంటే చికాకు పడ్డాడతను.

''సారీ సార్!'' అని కొంచెం వెనక్కి జరిగాడు. ఈలోగా ఆ సంచీ తాడుతెగి ఆనపకాయ జారి ముందు సీట్లో ఎడ్జస్టయి కూర్చున్న, పూర్వ సువాసిని నెత్తిమీద పడింది. ఆమె కెవ్వుమంది. కండక్టర్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

''చచ్చిపోయింది ముసల్ది'' అన్నారెవరో.

చచ్చిపోయిందామె కాదు. ఆనందరావే సిగ్గుతో, ఆమె సొమ్మసిల్లిపోతే.. ప్రక్కామె ఆమె తలను ఒళ్లో పెట్టుకుని, ముఖం మీద నీళ్ళు చల్లి తుడిచింది. అందరూ ఆనందరావుని కందిరీగల్లా పొడిచారు. కండక్టర్ కోపంతో కాయలు పారేస్తాననీ.... ఆనందరావు మరీ వెర్రివెంగళప్పలా గాక, డిగ్నిఫైడ్‌గా కనిపించ బట్టి, ''చూడండి! ఆ సంచి డ్రైవర్ ప్రక్కన పెట్టండి. దిగేటుప్పుడు తీసుకెళ్లురుగాని'' అన్నాడు పరిష్కారం చూపుతూ.

ఎలాగో విశాఖ చేరుకోగానే రెండు కాయలతో సంచీని గాజుల మలారంలా భుజానవేసుకుని, సూట్‌కేస్‌తో దిగాడు. సిటీబస్సు కోసం వెయిట్ చేస్తుంటే 'ఆటోబాయ్' వచ్చాడు. మళ్లీ సిటీబస్సులో ఏ రాద్ధాంతం జరుగుతుందోననుకుని ఆటో ఎక్కేసాడు. ఆటో స్పీడుగా పోతోంది. ఒకచోట పెద్ద చప్పుడుతో ఆగింది. ఆ ఆగటంతో ఆటో పడిపోయినంత పనైంది. ఆటో అయితే పడిపోలేదు గానీ ఆటో నుండి ఫుట్‌బాల్‌లా దొర్లుకుంటూ ఆనపకాయే క్రిందికి దూకేసింది. 'ఆ!..' అంటూ అరిచి, గెంతబోతున్నంతలో, ''ఆగండాగండి! వెనుకనుంచి లారీ వుస్తోంది!'' అన్నాడు ఆటోడ్రైవరు. లారీ రావటం,

ఆనపకాయ లారీ వెనుక చక్రాల క్రిందపడి బద్దలవటం క్షణాల్లో జరిగిపోయింది. బస్సులో ఆయన తిట్లు ఎంత వివర్షుల్లో గుర్తుకొచ్చాయి. కళ్ళంట నీళ్లు వచ్చాయి.

"ఎంత పనిచేశావయ్యా! ఆపమంటే ఆపలేదు. బంగారం లాంటి కాయ పాడయింది." నొచ్చుకున్నాడు.

"పోతేపోయింది సార్. వెధవకాయ. గెంతుంటే మీరే పోయిండేవారు. లేదా కాలో,చెయ్యో విరిగి ఉండేది" అన్నాడు. ఆటోడ్రైవరు. అదీ నిజమే అయినా, కాలో, చెయ్యో విరిగితే సానుభూతైనా ఉంటుంది కానీ, ఆనవకాయం తీసుకెళ్ళకపోతే ఆనంతలక్ష్మితో కష్టమేనే, అనుకుని,

"ఏయ్ అబ్బాయ్, కూరల మార్కెట్‌వైపు పోనీ!" అన్నాడు.

"పదెక్కువవుతుంది సార్!"

కూరల మార్కెట్లో ఆనపకాయలు కనిపించాయి. పాతికరూపాలు చెప్పాడు. ఇరవైకి కొని 'హమ్మయ్య!' అనుకున్నాడు.

ఇంటికెళ్లి, ఆటో దిగగానే లక్ష్మి ఎదురై" ఆనపకాయలు తెచ్చారా?" మొదటి ప్రశ్న. కోపంతో పళ్లు పటపట కొరుకున్నాడు శబ్దం వినిపించకుండా. ఆటో డ్రైవర్ నిజాన్నెక్కడ కక్కేస్తాడోనని, పర్సుతీసి డబ్బులివ్వటానికి జేబులో చెయ్యిపెట్టాడు. చెయ్యి లోనికెళ్లిపోతోంది. శరీరం చెమటతో తగుల్తోంది. పర్సులేదు. గుండెఝల్లుమంది. కూరల మార్కెట్లో బయటపెట్టి మరిచిన పర్సు విషయం అప్పుడు గుర్తొచ్చింది.

"పర్సుపోయిందా?" అంది అనంతం.

"అన్నట్టు కొత్తది కొనుక్కోవాలని పాతది పారేసా. చిల్లర్లేదు. ముప్పయి ఉంటే ఇయ్యి" అన్నాడు.

"కాంప్లెక్స్ నుంచి ముప్పయ్యా?"

"కాంప్లెక్స్ నుంచి కూరల మార్కెట్ కెళ్లారమ్మా!"

"కూరల మార్కెట్‌కా?"

"అబ్బ. ముందు డబ్బులియ్యవోయ్"

లక్ష్మి ఇంట్లోకెళ్లి డబ్బులు తెచ్చి ఇచ్చింది. ఆటో డ్రైవర్ని గబగబా పంపేసాడు. ఆనందరావు లోనికి అడుగుపెట్టాడో లేదో మంచి నీళ్లయినా ఇవ్వకుండా

"కూరల మార్కెట్ కెందుకెళ్ళారూ?" అడిగింది.

"ఆనపకాయ కొంటానికి"

"కొని తెచ్చారా?"

నాలుక్కరుచుకోబోయి, పొల్చేస్తుందని నెత్తికొట్టుకుని, "అబ్బ.మా ఆఫీసరు బామ్మరిది కూరల మార్కెట్లో ఉల్లిపాయల హోల్‌సేల్ దుకాణమట. ఓ విషయం చెప్పమన్నాడు చెప్పటానికెళ్లాను."

"అదేంటండీ, మీ ఆఫీసరు బావమరిది బెంగుళూరులో ఇంజనీరని ఆ మధ్య పార్టీలో వాళ్లావిడ చెప్పిందీ?" సాగదీసింది.

"అబ్బ, ఆఫీసరంటే మా ఆఫీసరు కాదు. పక్క సెక్షనాఫీసరు" అంటుండగా, "అదేంటి? ఒక కాయపొడుగ్గా, ఒక కాయేమో గుండ్రంగా ఉందీ? మనపాదు గుండ్రపాటి కాయలు కదా కాసిందీ?" అంది సంచిలోంచి కాయలు తీస్తూ.

ఆనందరావు మీద పిడుగులు పడ్డాయి. నీళ్లు నములుతున్నాడు.

"అమ్మా! అల్లుడి గారు చెమటపట్టి ఉన్నారు. భోజనం కూడా లేదు. కాళ్ళు కడుక్కొని రానియ్యవే...." అనగానే కొండమీద ఆనపపాదునుంచి ఉడుత కొరికితే దొర్లిన ఆనవకాయలా మెట్లుదిగి బాత్రూంలోకి పారిపోయాడు ఆనందరావు.